వలంటీర్లకూ వంచనే

ఏరు దాటాక తెప్ప తగలేసిన చందాన సీఎం చంద్రబాబు వ్యవహార శైలి ఉందని వలంటీర్లు నిప్పులు చెరుగుతున్నారు. ఎన్నికల ముందు ×వలంటీర్లను కొనసాగిస్తా.. గౌరవ వేతనం రూ.5 వేలు ఏ మూలకు సరిపోతుంది.. రూ.10 వేలు ఇచ్చే బాధ్యత నాదీ । అంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు నోరు మెదపకపోవడంపై వలంటీర్లు కన్నెర్ర చేస్తున్నారు. అసలు వలంటీర్ల వ్యవస్థే లేదంటూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి శాసన మండలిలో మాట్లాడడంపై వలంటీర్లు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.


కోవిడ్ సమయంలోనూ సేవలందిస్తున్న వలంటీర్లు (ఫైల్)


స్విమ్స్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్ సులోచన (ఫైల్)

- రూ.10 వేల వాగ్దానం మరిచిన ప్రభుత్వం
- కరోనాలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సమాయత్తం

పుత్తూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.66 లక్షల మంది వలంటీర్లు గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించారు. కోవిడ్ సంక్షోభంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన ఘనత వలంటీర్లది. అలాంటి వలంటీర్లకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు గౌరవ వేతనం పెంచుతామని ప్రకటించిన చంద్రబాబు నేడు ఆ విషయాన్ని దాటవేయడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని వలంటీర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని సాక్షాత్తు ప్రధాని మోదీ ప్రశంసించారని గుర్తు చేస్తున్నారు. అలాంటిది రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థే లేదని, వారిని కొనసాగించే పరిస్థితి ప్రస్తుతానికి లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శాసనమండలిలో ప్రకటించడంపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

150 రోజుల్లో చేసిన మంచి ఇదేనా?



గడచిన 150 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అద్భుతం వలంటీర్లను తొలగించడమేనా? వలంటీర్ల గౌరవ వేతనాన్ని నిలిపేయడంతో సంపద సృష్టించారా? ఈ సంపదను ఎవరి కోసం వెచ్చిస్తారు. చిన్న కుటుంబాల జీవితాలతో ఆటలాడుకోవద్దు.

– పి.హరికృష్ణ, వలంటీరు , తొరూరు.

మహిళలనూ మోసం చేయడమే



వలంటీర్లలో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తే మహిళలను మోసం చేసినట్లే. ఆడపడుచుల ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు మహిళా వలంటీర్లకు ఏం సమాధానం చెబుతారు? కొన్ని లక్షల కుటుంబాలకు అన్యాయం చేయడం సరికాదు.

– జయలక్ష్మి, వలంటీరు, పుత్తూరు

వ్యవస్థే లేకుంటే వేతనం ఎలా ఇస్తామన్నారు?



వలంటీర్ల వ్యవస్థే లేకుంటే రూ.10 వేలు ఇస్తామని ఎలా హామీ ఇచ్చారు?. ఎన్నికల తర్వాత మే నెల వేతనం రూ.277.21 కోట్లు ఇచ్చినట్లు ఎలా చెబుతారు? ఇది కేవలం గత ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థ కనుకే రద్దు చేస్తున్నారు. ఎన్నికల ముందే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించాల్సి ఉండాల్సింది.

– ఇందుప్రియ, వలంటీరు, కొత్తవీధి, పుత్తూరు

పారదర్శకంగా పనిచేశాం



ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిలా పారదర్శకంగా పనిచేశాం. కోవిడ్ సంక్షోభంలో ప్రాణాలకు తెగించి సేవ లందించాం. మంచి పనులు చేస్తూ ఆదుకుంటున్న చిన్నపాటి గౌరవ వేతనాన్ని మాకు దక్కకుండా చేయడం ఎంత వరకు సమంజసం

– ఎస్. లావణ్య, వలంటీరు, పుత్తూరు

మహిళా పోలీసుకు పరామర్శ


ఆస్పత్రిలో కృష్ణవేణిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా పోలీసు కృష్ణవేణిని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరం వైఎస్సార్ సీనియర్ నాయకుడు కట్ల రవి భార్య కృష్ణవేణి కార్వేటినగరం సచివాలయం–1లో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణ అనంతరం ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదానికి గురై తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారాన్ని అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తిరుపతి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

పాలసముద్రం : క్షయ వ్యాధితో భయపడాల్సిన పనిలేదని వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. శనివారం మండలంలో రెండు గ్రూప్‌లుగా బీసీసీ టీకాలు వేశామన్నారు. శ్రీబొమ్మరాజుపురం, రాచపాల్యం గ్రామంలో సూపర్ వైజర్ సుశీల ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనకు టీకాలు వేశారని తెలిపారు. ప్రభుత్వాలు క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా 60 ఏళ్లు ఉన్న వారికి టీకాలు వేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలు , పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఉన్నా పోలీస్ కంట్రోల్ నంబర్ 100 , చైల్డ్ లైన్ నంబర్ 1098కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


రంగాపురంలో తాగునీటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం : గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆముదాల సచివాలయ ఆవరణంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ అనురేఖ సమక్షంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దోమకాటుతో సంక్రమించే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం గ్రామాలకు వెళుతున్న బోరు మోటారులో వర్షపు నీరు కలుషితం కాకుండా బోర్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ లేకుండా శుభ్రం చేశారు.

ఆంజనేయులుకు శాశ్వత సభ్యత్వం


శాశ్వత సభ్యత్వ పత్రాన్ని స్వీకరిస్తున్న ఆంజనేయులు

పుత్తూరు: వేపగుంట గ్రామానికి చెందిన కొండేటి ఆంజనేయులుకు ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘంలో శాశ్వత సభ్యత్వాన్ని కల్పించారు. శుక్రవారం పుత్తూరులోని ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో జాతీయ చైర్మన్ కాసల కోనయ్య శాశ్వత సభ్యత్వ పత్రాన్ని ఆంజనేయులుకు అందజేశారు. కోనయ్య మాట్లాడుతూ.. సంఘం జాతీయ డైరెక్టర్‌గా ఆంజనేయులు అందించిన సేవలను గుర్తించి ఆయనకు శాశ్వత సభ్యత్వాన్ని ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పత్తిపాటి సరేష్‌కుమార్, రాష్ట్ర చైర్మన్ గణేష్, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి శనివారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నందారపు దేవి బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పాలసముద్రం ఎమ్ఆర్ఐగా విధుల్లో చేరారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

రోడ్లపై పేడదిబ్బలు వేస్తే జరిమానా

కార్వేటినగరం : గ్రామీణ రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే జరిమానా తప్పదని ఎంపీడీఓ చంద్రమౌళి హెచ్చరించారు. పారిశుధ్యం మెరుగు పరచడంలో భాగంగా శనివారం ఆర్కేవీబీ పేట పంచాయతీలో రాజులకండ్రిగ, ఇందిరా కాలనీ గ్రామ సమీపంలో రోడ్లపై నిల్వ చేసిన పేడ దిబ్బలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వ్యర్థాలను నిర్లక్ష్యంగా వీధుల్లో, మురుగు కాల్వల్లో వేయడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా , చికెన్ గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామ వీధులు, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో పేడ దిబ్బలు నిల్వ చేసే వారిని కార్యదర్శులు విధిగా గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి జరిమాన విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా వినియోగంపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న సీఐ మహేశ్వర్

నగరి : సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని సీఐ మహేశ్వర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ బెదిరింపులు అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ , కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమై ఉంటాయని సొంత వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పకూడదన్నారు. లాటరీ తగిలిందనో, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామనో ఆధార్ నంబర్లు, ఓటీపీలు చెప్పమంటే చెప్పకూడదన్నారు. అటువంటి ఫోన్‌లు వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ బెదిరింపులకు సంబంధించిన ఫోన్‌లు వస్తే వెంటనే స్థానిక పోలీస్టేషన్‌ను సంప్రదించాలన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వేణుగోపాల్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల వినియోగంలో అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ అప్లికేషన్ విభాగాధిపతి శ్రీలక్ష్మి, కంప్యూటర్‌సైన్స్ విభాగాధిపతి ఉమామహేశ్వరి, ఐక్యూ కోఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, అధ్యాపకులు అరుణకుమారి, పంకజ, రేవతి ఝాన్సీరాణి, కలైవాణి, లాల్బాషా, ఎస్ఎస్‌సీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

3200 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటతో అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది

నగరి : మండలంలోని అడవికొత్తూరు, సత్రవాడ అటవీ ప్రాంతంలో శనివారం నిర్వహించిన దాడుల్లో 3,200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్ , పుత్తూరు సీఐ మురళి మోహన్‌తో పాటు సిబ్బందితో గాలింపు చేపట్టగా సత్రవాడ, అడవికొత్తూరు అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన 3,200 లీటర్ల సారా ఊటను కనుగొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. పరారీ అయిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించి సారా వల్ల కలిగే అనర్థాలను గ్రామస్థులకు వివరించడంతో పాటు, సారా కాచి అమ్మడం వల్ల చట్టరీత్యా ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేయడం జరిగిందన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి


దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న సాయి సేవకులు

నగరి : సత్యసాయిబాబా జయంతి వేడుకలను సాయి మందిర నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద సత్య సాయి చిత్రపటాన్ని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం టీఆర్ కండ్రిగ వద్ద గల సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లాయర్ మురళీధర్, రమణ, లీలావతి, సావిత్రమ్మ, భాస్కర్, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వేరుశనగలో విత్తనశుద్ధి తప్పనిసరి

నింద్ర : రబీ సీజన్‌లో వేరుశనగ పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎలకాటూరు గ్రామంలో వేరుశనగ పంటపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. భూమిలో క్రిమికీటకాలు విత్తనాలను నాశనం చేయకుండా ఉండాలంటే ఎం45 మందుతో విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

విజయపురం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ బలరాం సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం 4గంటల ప్రాంతంలో పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఎస్ఐ బలరాం సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేసి తహశీల్దార్‌కు అప్పగించారు. ఇసుక తరలింపులో ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, నిబంధనల ప్రకారం ఇసుక తీసుకెళ్లాలని సూచించారు. రాత్రివేళ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ గోవిందన్, సిబ్బంది నరేష్, సత్య ఉన్నారు.

జోరుగా నాటుసారా

పాలసముద్రం : మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. నరసింహపురంలో కొంత మంది నాయకులు సారా తయారు చేసి మండంలోని అన్ని గ్రామాలకు ద్విచక్రవాహనంలో సరఫరా చేస్తున్నారని ప్రజల నుంచి విమర్శలున్నాయి. వారం రోజుల కిందట చిత్తూరు ఎక్సైజ్ పోలీసులు సారా బట్టీలపై దాడులు చేసినా పూర్తి స్థాయిలో జరగలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐ శిరీషాదేవిని వివరణ కోరగా.. మండలంలో ఎక్కడ సారా తయారీ, విక్రయాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల నుంచి సమాచారం అందితే దాడులు చేసి ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు.

సోలార్‌తో విద్యుత్ చార్జీల ఉపశమనం


సురేంద్రనాయుడు, ఎస్ఈ

పుత్తూరు : ప్రతి ఇంటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గించుకోవచ్చని, సోలార్ విద్యుత్ తయారీ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు సూచించారు. శనివారం స్థానిక విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి 3 కిలోవాట్స్‌కు రూ.75 వేలు రాయితీని ప్రతి వినియోగదారుడు పొందవచ్చునని తెలిపారు. ఒక కిలోవాట్ వినియోగ విద్యుత్ బిల్లు సుమారు వెయ్యి రూపాయలు కాగా సోలార్ విద్యుత్ ద్వారా కేవలం రూ.338 మాత్రమే వస్తుందన్నారు. 2 కిలో వాట్స్‌కు రూ.333 వస్తుందని, 3 కిలో వాట్స్‌కు రూ.293 మాత్రమే వస్తుందని వివరించారు. కార్యక్రమంలో డీఈ ఆశీర్వాదం, ఏడీ శంకరయ్య, ఏఈలు సాయి, రవికుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల భవిష్యత్తుకు పునాది


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం : అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాదులని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో బోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..పిల్లలకు తెలుగు, ఆంగ్ల పదాలను గుర్తించడం వంటి అంశాల మీద అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ.. సమాజంలో నేడు జరుగుతున్న సైబర్ నేరాలు, పిల్లలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మసునంద, ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, రీసోర్సు పర్సన్ రాబర్ట్, చెంగల్‌రాజు, నరేశ్, హెచ్ఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మహా కాల రక్షక యాగం



యాగ పూజల్లో పురోహితుడు, ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి

నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో మహాకాళ రక్షక యాగాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కాలభైరవాష్టమి పూజల్లో భాగంగా ఈ యాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాల నుంచి విచ్చేసిన పురోహితులు ప్రత్యేక యాగపూజ, కళశ , అభిషేక పూజలు నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం చేశారు. అభిషేకానంతరం పుష్పాలతోను, వడమాలలతోను స్వామిని అలంకరించగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. యాగ, అభిషేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి కొనుగోలుకు బిల్లు ఇవ్వాలి




సదస్సులో మాట్లాడుతున్న సహాయ కమిషనర్, సదస్సుకు హాజరైన వ్యాపారులు, ఆడిటర్లు

నగరి : వాణిజ్య నిబంధనలు విధిగా పాటించాలని సేల్స్ టాక్స్ సహాయ కమిషనర్‌లు వరలక్ష్మి, పొనమ్ పేర్కొన్నారు. శనివారం వర్తక, వాణిజ్య సంస్థల నిర్వాహకులు, సిబ్బంది, ఆడిటర్లు, ఎస్‌టీపీలకు స్థానిక మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.200కు పైబడిన కొనుగోలుకు ప్రతి వ్యాపారి విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ప్రతి నెలా నిర్దేశిత గడువు లోపల వ్యాపార లావాదేవీలకు సంబంధిత రిటర్న్‌లను సమర్పించాలన్నారు. ప్రతి వ్యాపారి ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులకు బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. సదస్సులో జీఎస్‌టీ అధికారి సాబ్‌జాన్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాకృష్ణ, ఆడిటర్లు శక్తివేల్, తంగరాజ్, ధరణి, తేజ, సాయి, మహేష్ పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

విజయపురం : మండలంలో పంటల బీమా పథకం రబీ 2024–25 సంవత్సరానికి పంటల వారిగా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి రజినీకుమారి తెలిపారు. మండలంలో పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు పంట రుణ గ్రహీతలు నేరుగా బ్యాంకు ద్వారా ఎకరా వరికి రూ.84, వేరుశెనగ రూ. 60 చెల్లించాలన్నారు. పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేరుగా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం డిసెంబర్ 31వ తేదీలోపు చెల్లించాలని కోరారు.

స్మార్టు లాక్‌లతో దొంగతనాలకు చెక్


వినియోగంపై డెమో చూపుతున్న సీఐ

కార్వేటినగరం : దొంగతనాలకు చెక్ పెట్టేందుకు స్మార్టు లాక్‌లు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ హనుమంతప్ప పేర్కొన్నారు. శనివారం కార్యాలయంలో స్మార్టు లాక్‌ల వినియోగంపై డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడానికి ఎస్పీ మణికంఠ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ 300 స్మార్టు లాక్‌లను తీసుకొచ్చారన్నారు. గతంలో నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే మరింత టెక్నాలజీని ఉపయోగించి స్మార్టు లాక్‌లను తీసుకురావడం జరిగిందన్నారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యమైన షాపులు, ఇళ్లకు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చన్నారు. దొంగలు తాళాన్ని తాకిన వెంటనే అలారం మోగడం ప్రారంభమవుతుందని, స్థానికులు అప్రమత్తం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్మార్టు లాక్ విలువ రూ.400 మాత్రమేనని, అవసరమైన వారు ఎస్ఐని సంప్రదించాలని సూచించారు. అనంతరం అతి తక్కువ ధరతో స్మార్టు లాక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిన ఎస్ఐ రాజ్‌కుమార్‌ను అభినందించారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి


వినికిడి యంత్రాలను అందిస్తున్న జడ్జి జానకి

పుత్తూరు : విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మదర్‌థెరీసా బదిరుల పాఠశాల నందు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. మేనరికపు వివాహాల కారణంగా అంగ వైకల్యంతో పిల్లలు పుడుతారని, దీనిని నివారించడానికి మేనరికపు వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే చిన్నతనంలోనే పిల్లల వినికిడి, మాటలను పరిశీలించి ఏదైనా లోపం ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం బదిరల పిల్లలకు వినికిడి సాధనాలను అందజేశారు. కార్యక్రమంలో నగరి ఏరియా ఆసుపత్రి డాక్టర్ సిద్ధయ్య, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు పావని, జయ, వైద్య సేవలందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు శివయ్య, జయశేఖర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.